సంపుటి :02 సంచిక :287 పేజీలు :06 వెల ₹5

అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శనివారం 24, జనవరి 2026

## మార్బుల్ రాళ్లు పడి ఇద్దరు యువకుల మృతి

- మహబూబాబాద్ జిల్లా బంగ్లా తండాలో ఘటన
- మృతుల్లో ఒకరు బంగ్లా తండావాసి.. మరొకరు ఖమ్మం జిల్లావాసి

04



తరుణ్(ఫైల్), అవినాశ్(ఫైల్)

## బావిలో పడి తండ్రీకొడుకుల మృతి

- కుమారుడిని కాపాడబోయి తండ్రి కూడా..
- బలరాం తండాలో విషాదం

04

# ఆర్ఐ అవినీతి చిట్టా


లంచం ఇస్తేనే పని.. లేదంటే ఎమ్మెల్యే పేరిట బెదిరింపులు! జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ మండల ఆర్ఐ అవినీతి దందాతో సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ఏకంగా రూ.లక్ష వసూలు చేయడమే కాకుండా, నిబంధనలకు విరుద్ధంగా రిపోర్టులు ఇచ్చి కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నారు. తహసీల్దార్‌ను సైతం లెక్కచేయకుండా, చివరకు అధికార పార్టీ నాయకులనే బెదిరిస్తున్న ఈ 'రెవెన్యూ' ఘనుడి ఆగడాలపై 'దిశ' ప్రత్యేక కథనం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారిపై విచారణ జరిపి వేటు వేయకపోతే, మండలంలో రెవెన్యూ వ్యవస్థ మరింత భ్రష్టు పట్టడం ఖాయమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– అక్షరదర్బార్, మొగుళ్లపల్లి

ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రూ.లక్ష వసూలు

- ఎమ్మెల్యే పేరుతో అధికార పార్టీ నేతలకే బెదిరింపులు
- రేషన్ కార్డులు, విద్యార్థుల సర్టిఫికెట్ల వద్ద వేలల్లో డిమాండ్
- నిబంధనలకు విరుద్ధంగా రిపోర్టులు ఇచ్చి కుటుంబాల్లో చిచ్చు

02




## తుపాకీ వీడి జన జీవన స్రవంతిలోకి!

- ఎనిమిది మంది మావోయిస్టుల లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో ఒక మహిళ
- వారి ఆయుధాలు సైతం అప్పగింత
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

02



# నెక్స్ట్ నోటీసులు కవితకేనా?

- తెలంగాణలో తెరపైకి మరో ఆసక్తికర అంశం
- విచారణ అధికారిగా సజ్జనార్ నియమితులైన తర్వాత అనూహ్య పరిణామాలు
- ఫోన్ ట్యాపింగ్ లో ఇప్పటికే హరీశ్, కేటీఆర్ విచారణకు హాజరు
- ఇదే పరంపరలో కవితకు నోటీసులిచ్చే అవకాశం
- ఆమె భర్త అనిల్, మాజీ ఎంపీ సంతోశ్‌కు కూడా..?

02



## పుర పోరుకు జాగృతి సిద్ధం

- ఫార్వర్డ్ బ్లాక్‌తో కవిత కీలక ఒప్పందం
- ఆ పార్టీ సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి..
- మున్సిపల్, ప్రాదేశిక ఎన్నికలకు సన్నాహాలు

02

## గులాబీ దళం ఐక్యరాగం!

- మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా
- ఎర్రబెల్లి, పల్లా, పోచంపల్లి, రాజయ్యల సమరశంఖం
- స్టేషన్ ఘనపూర్ లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

05

# ఆర్ఐ ఆగడాలు

- ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రూ.లక్ష వసూలు
- ఎమ్మెల్యే పేరుతో అధికార పార్టీ నేతలకే బెదిరింపులు
- రేషన్ కార్డులు, విద్యార్థుల సర్టిఫికెట్ల వద్ద వేలల్లో డిమాండ్
- నిబంధనలకు విరుద్ధంగా రిపోర్టులు ఇచ్చి కుటుంబాల్లో చిచ్చు




అక్షరదర్బార్, మొగుళ్లపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల సర్కిల్ పరిధిలో రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిపోతోంది. గత మార్చిలో విధుల్లో చేరిన ఓ మండలంలోని రెవెన్యూ ఇన్స్పెక్టర్ (ఆర్ఐ) అవినీతి రోజురోజుకు హద్దులు మీరుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్య ప్రజల నుండి మొదలుకొని అధికార పార్టీ నాయకుల వరకు ఎవరిని వదలకుండా లంచాల వేట కొనసాగిస్తున్న ఈ 'ఘనుడి' తీరుపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– లక్షకు పడగలెత్తిన ఫ్యామిలీ సర్టిఫికెట్!

ఒక గ్రామానికి చెందిన కోటి అనే వ్యక్తి కుటుంబం నుండి రెండు ఎకరాల 10 గుంటల భూమికి సంబంధించిన ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం ఏకంగా రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాంటి న్యాయపరమైన లీగల్ హెయిర్ సర్టిఫికెట్ లేకుండానే, కేవలం డబ్బులు అందాయనే కారణంతో నిబంధనలకు విరుద్ధంగా సదరు ఆర్ఐ సర్టిఫికెట్ జారీ చేశారు. దీంతో రెండు కుటుంబాల మధ్య తగాదాలు తారాస్థాయికి చేరి, బాధితులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ వసూళ్లలో పైస్థాయి అధికారులకు కూడా వాటా ముట్టినట్లు మండలంలో బహిరంగ చర్చ సాగుతోంది.

### - అధికార పార్టీ నేతలపైనే బెదిరింపులు!

సదరు ఆర్ఐ బరితెగింపు ఏ స్థాయిలో ఉందంటే.. ఏకంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడి భూమి విషయంలో అనుకూల రిపోర్టు ఇస్తానని పదివేల రూపాయలు లంచం తీసుకుని, ఇప్పుడు రిపోర్టు ఇవ్వకుండా నెలల తరబడి తిప్పుతున్నట్లు తెలుస్తోంది. బాధితుడు ప్రశ్నిస్తే.. "నువ్వు అధికార పార్టీ నేతవైతే నాకేంటి? నీ పని చేయవద్దని ఎమ్మెల్యేనే నాకు చెప్పారు" అంటూ ఎమ్మెల్యే పేరు వాడుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

### - కనికరం లేని వసూళ్లు..

ఓ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు మహిళల ఫ్యామిలీ సర్టిఫికెట్ కోసం రూ. 30 వేలు వసూలు చేసి వారిని అరిగోస పెడుతున్నారు. రేషన్ కార్డుల కోసం వచ్చే నిరుపేదల వద్ద కూడా ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. తహసీల్దార్‌ను సైతం లెక్కచేయకుండా, తానే సర్వస్వంగా భావిస్తూ మండలంలో లంచాల సామ్రాజ్యాన్ని నడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### - కలెక్టర్ గారు.. దృష్టి సారించండి!

జిల్లాలో ఇద్దరు ఆర్ఐలు ఇలాగే చెలరేగిపోతున్నా జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లంచాల పరంపర ఇలాగే కొనసాగితే సామాన్యుడు నరకం అనుభవించాల్సి వస్తుందని మేధావులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు స్పందించి, విచారణ జరిపి సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లంచాల ప్రక్రియకు మంగళం పాడాలని ప్రజలు కోరుతున్నారు.



# కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- క్యాంప్ కార్యాలయంలో సన్నాహక సమావేశం

అక్షరదర్బార్, వర్ధన్నపేట: పురపాలక ఎన్నికల్లో వర్ధన్నపేట మున్సిపాలిటీని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ సమరశంఖం పూరించింది. శనివారం వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, ఎన్నికల వేళ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కదలాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ వివరించాలి అని ఆయన సూచించారు.

### - నేతల ఐక్యత - గెలుపుపై ధీమా

ఈ సమావేశంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్ రావు తదితరులు పాల్గొని పార్టీ గెలుపు కోసం తమ వ్యూహాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి పాల్గొన్నారు.

# తుపాకీ వీడి జనజీవన స్రవంతిలోకి!

- ఎనిమిది మంది మావోయిస్టుల లొంగుబాటు
- లొంగిపోయిన వారిలో ఒక మహిళ
- వారి ఆయుధాలు సైతం అప్పగింత
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షరదర్బార్, రామగుండం : మావోయిస్టులు ఆయుధాలను వీడి అడవి నుంచి జనజీవన స్రవంతిలోకి రావాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. శనివారం పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సమక్షంలో ఎనిమిది మంది మావోయిస్టులు లొంగిపోయారు.వారి ఆయుధాలు కూడా అప్పగించారు. వీరంతా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో మావోయిస్టు మిలీషియా, కొరియర్, సాంస్కృతిక విభాగాల్లో పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారిలో ముఖ్య నేత శ్రీకాంత్‌తో పాటు ఒక మహిళా మావోయిస్టు కూడా ఉన్నారు. అజ్ఞాతంలో ఉన్నవారు హింసా మార్గాన్ని వీడి ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని అందుకోవాలని సీపీ సూచించారు. గన్ను దించి రాజ్యాంగం అందించిన హక్కులను గౌరవించాలని పోలీసు ఉన్నతాధికారులు కోరుతున్నారు. పోరు మార్గం కంటే ఊరు ముద్దు అనే నినాదంతో అడవిని విడిచి రావాలని హితవు పలికారు. లొంగిపోయే వారికి రక్షణ కల్పించడంతో పాటు ప్రభుత్వం తరపున పునరావాస ప్యాకేజీలు, సంక్షేమ పథకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాజ్యాంగం ద్వారానే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని గుర్తు చేశారు. హింస ద్వారా సమాజానికి నష్టం జరుగుతుందని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నేరాల బాటలో పయనించి శిక్షలు అనుభవించే కంటే అజ్ఞాతం వీడి శాంతియుత జీవనం గడపాలని సీపీ సూచించారు.



# పుర పోరుకు జాగృతి సిద్ధం

- ఫార్వర్డ్ బ్లాక్ తో కవిత కీలక ఒప్పందం
- ఆ పార్టీ సింహం గుర్తుతో ఎన్నికల బరిలోకి..
- మున్సిపల్, ప్రాదేశిక ఎన్నికలకు సన్నాహాలు

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగుతున్న తరుణంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న తమ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల బరిలో నిలవడానికి కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. ప్రస్తుతం తన పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్న నేపథ్యంలో ఆమె తాత్కాలికంగా ఇప్పటికే పార్టీ గుర్తు ఉన్న పార్టీ వైపు మొగ్గారు. దీనిలో భాగంగానే ఆమె మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీతో కలిసి పనిచేయాలని నిర్ణయించారు. జాగృతి అభ్యర్థులందరూ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన 'సింహం' గుర్తుపైనే పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఏఐఎఫ్బీ రాష్ట్ర నాయకత్వంతో జాగృతి ప్రతినిధులు జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. అభ్యర్థులకు బీ–ఫారాలు ఇచ్చేందుకు ఆ పార్టీ అంగీకరించింది. ఏళ్ల తరబడి ఉద్యమ బాటలో నడిచిన కార్యకర్తలకు ఈ ఎన్నికల్లో తగిన గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా కవిత ఈ అడుగు వేశారు. సాంకేతిక కారణాల వల్ల ఎన్నికల పోటీకి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ఈ తాత్కాలిక ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. సింహం గుర్తుతో బరిలోకి దిగడం వల్ల ఓటర్లలోకి బలంగా వెళ్లవచ్చని జాగృతి వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక సమస్యల పరిష్కారం, తెలంగాణ వాదం వినిపించడమే ధ్యేయంగా అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఈ పరిణామం మున్సిపల్ ఎన్నికల రాజకీయాల్లో పెను మార్పులకు కారణం కానుంది. సొంత పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా సమాంతరంగా వేగవంతం చేశారు.

# నెక్స్ట్ నోటీసులు కవితకేనా?

- తెలంగాణలో తెరపైకి మరో ఆసక్తికర అంశం
- విచారణ అధికారిగా సజ్జనార్ నియమితులైన తర్వాత అనూహ్య పరిణామాలు
- ఫోన్ ట్యాపింగ్ లో ఇప్పటికే హరీశ్, కేటీఆర్ విచారణకు హాజరు
- ఇదే పరంపరలో కవితకు నోటీసులిచ్చే అవకాశం
- ఆమె భర్త అనిల్, మాజీ ఎంపీ సంతోష్ కు కూడా..?



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు ఇప్పుడు మరో కీలక దశకు చేరుకుంది. బీఆర్ఎస్ అగ్రనేతలకు వరుసగా నోటీసులు జారీ చేస్తున్న సిట్ అధికారులు తదుపరి విచారణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నోటీసులు ఇచ్చేందుకు దర్యాప్తు బృందం సిద్ధమైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్, మాజీ ఎంపీ సంతోష్ రావును కూడా విచారించే అవకాశం ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో తన భర్త ఫోన్లను ట్యాప్ చేశారంటూ కవిత గతంలో పలుమార్లు బహిరంగంగానే ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించేందుకు సిట్ అధికారులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే హరీశ్ రావు, కేటీఆర్ వంటి కీలక నేతలను ప్రశ్నించి వారి వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు. ఇప్పుడు కవిత నుంచి స్టేట్ మెంట్ తీసుకోవడం ద్వారా కేసులో మరిన్ని కీలక ఆధారాలు లభిస్తాయని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. ముఖ్యంగా కేసీఆర్ కుటుంబ సభ్యులను వరుసగా విచారిస్తున్న తీరు చూస్తుంటే దర్యాప్తు ఒక క్రమపద్ధతిలో సాగుతున్నట్లు కనిపిస్తోంది. కీలక నేతలందరినీ ప్రశ్నించిన తర్వాత చివరిలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న ఈ కేసులో తదుపరి అడుగు ఎటు పడుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది. అతి త్వరలోనే సిట్ అధికారులు ఈ నోటీసులపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

# గండ్ర సత్తన్న సేవలు ప్రశంసనీయం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు (గండ్ర సత్తన్న) ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న కష్టపడి పనిచేసే నాయకుడని రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశంసించారు. శనివారం మొగుళ్లపల్లి మండలం పాత ఇస్సీపేట గ్రామంలో రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న గోదాము, జిల్లా కేంద్రంలో కూడళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, చేనేత రుణ మాఫీ, వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఒక్క గోదాం శంకుస్థాపనకే పరిమితం కాకుండా నియోజకవర్గానికి మరిన్ని గోదాములు, సహకార సంఘాలు, మోడల్ మార్కెట్‌లు అవసరమని ఎమ్మెల్యే కోరడం ఆయన అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామాన్ని, ప్రతి గడపను చేరుకున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణే ఏకైక ఎమ్మెల్యే అని అభినందించారు. ఎన్నికలు ఉన్నా లేకపోయినా ప్రజల్లోనే ఉంటూ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించే మంచి ప్రజాప్రతినిధి సత్తన్న అని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎంపీ కడియం కావ్య, డీఆర్‌డీఏ పీడీ బాలకృష్ణ, తాసిల్దారు సునీత, ఎంపీడీవో సురేందర్ గౌడ్, భూపాలపల్లి ఎస్పీ సంకీర్త్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, ఎస్సెలు బి. అశోక్, దివ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి, సర్పంచులు పాల్గొన్నారు.



# నర్సంపేట అభివృద్ధే బీజేపీ నినాదం

## ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

అక్షర దర్బార్, నర్సంపేట : రానున్న మున్సిపల్ ఎన్నికల్లో నర్సంపేట అభివృద్ధే బీజేపీ నినాదంగా ప్రజల వద్దకు వెళ్లి విజయం సాధిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. శనివారం నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని సర్వపురం 5వ, 6వ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరారు. వారిని జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఇతర నాయకులు కమలం కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, నర్సంపేట మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్ వడ్డేపల్లి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ శీలం సత్యనారాయణ, కొనుముల పృధ్వీరాజ్, పంజర్ల రామ్, పొదిళ్ళ రామచందర్, బాల్నే జగన్ పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన సదస్సు




ములుగు, అక్షర దర్బార్: మేడారం జాతర సందర్భంగా భక్తులు, పర్యాటకుల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో రాంకో సిమెంట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిర్మూలన, ఫైర్ కంట్రోల్, అడవి జంతువులకు ఆహారం వేయరాదు అనే అంశాలపై అవగాహన స్టిక్కర్ బోర్డులను సీహెచ్ సువర్ణ ఐఎఫ్ఎస్ ఆవిష్కరించారు. ములుగు–పస్రా–తాడ్వాయి మధ్య జాతీయ రహదారి ఇరువైపుల ఈ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి. ప్రభాకర్ ఐఎఫ్ఎస్ సిసిఎఫ్. కాళేశ్వరం (భూపాలపల్లి), రాహుల్ కిషన్ జాదవ్ ఐఎఫ్ఎస్ డీఎఫ్ఓ ములుగు, కె. సత్తయ్య ఎఫ్ డి ఓ ములుగు , డోలి శంకర్ ఎఫ్ ఆర్ వో ములుగు,రాంకో సిమెంట్ లిమిటెడ్ కి సంబంధించిన జి శర్వనన్,సీనియర్ మేనేజర్ మార్కెటింగ్ టి వినయ్ కుమార్ జూనియర్ మేనేజర్ మార్కెటింగ్,డి సాయి ఆదర్శ,మానేజ్మెంట్ ట్రైనీ డి. మెహన్,ఇంజనీర్ టెక్నికల్ సోర్సస్ డీవై ఆర్ఓలు, ఎఫ్ బిఓ లు పాల్గొన్నారు.

# జాతీయ బాలిక దినోత్సవం



శాయంపేట, అక్షర దర్బార్: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా శాయంపేట మండలంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. సాయి కృష్ణ మాట్లాడుతూ బాలిక సంరక్షణ, బాలికల విద్య ఎంతో అవసరమని, కూతురు భారం కాదు వరమని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అనంతరం బాలికలతో బాలిక సంరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు పిఎచ్ఎన్ శోభ, హెచ్ఈఓ సంపత్, సూపర్వైజర్ మల్లేశం, ఏఎన్ఎం శ్రావణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడి ఆయుధం 'అక్షర దర్బార్'

## భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్షర దర్బార్ తెలుగు సంచలన దినపత్రిక సామాన్యుడి చేతిలో ఒక ఆయుధంలా మారిందని భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు అన్నారు. శనివారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో అక్షర దర్బార్ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రారంభించిన అతి తక్కువ కాలంలోనే డిజిటల్ రంగంలో వేగంగా ముందుకు సాగుతూ సమకాలీన సామాజిక అంశాలను విశ్లేషణాత్మకంగా ప్రచురించడం అభినందనీయమన్నారు.



చిట్యాల సీఐ డి. మల్లేష్ మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్షర దర్బార్ తనకంటూ ప్రత్యేకమైన "సిగ్నేచర్"ను ఏర్పరుచుకోవడం ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సంపత్ రావుతో పాటు చిట్యాల సీఐ మల్లేష్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గజ్జి రాజకుమార్, అక్షర దర్బార్ భూపాలపల్లి క్రైమ్ రిపోర్టర్ రాళ్లబండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# వర్గ సామాజిక పోరాటాలే ప్రత్యామ్నాయం

## ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

అక్షర దర్బార్, దుగ్గొండి : వినాశనకర పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా వర్గ సామాజిక పోరాటాలే ప్రత్యామ్నాయమని, ఆ దిశగా నిర్మాణాత్మక ఉద్యమాలు చేపట్టాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎంసిపిఐ(యు) రాష్ట్రస్థాయి సిద్ధాంత రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమాజ చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని తెలిపారు. కార్మిక–కర్షక–కూలీ వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలు ఉధృతం చేయాలని కోరారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పాలకులు చట్టాలు మారుస్తుండటంతో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో మార్క్సిజం సూచించినట్లుగా కార్మిక వర్గ నాయకత్వంలో శ్రామికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగాల రాగసుధ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా, రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పార్టీ భవిష్యత్తు కర్తవ్యాలను వివరించారు. వివిధ జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆత్మీయ అభినందన సభ

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం

## సర్పంచ్ బండి రేణుక శంకర్

అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజున చర్లపల్లి గ్రామ పంచాయతీకి నూతనంగా ఎన్నికైన పాలక వర్గానికి చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ అధ్యక్షత వహించగా సర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంఖ్య పెరగడానికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. అనంతరం సర్పంచ్ బండి రేణుక శంకర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. అనంతరం సర్పంచ్ బండి రేణుక శంకర్, ఉప సర్పంచ్ మామిడాల శ్రీనివాస్ రెడ్డి వార్డు మెంబర్లు భీముడి విజయ, తూర్పాటి ఐలయ్య, భనువారి తిరుపతమ్మ, పొడిశెట్టి బ్రహ్మం, మీనుగు దేవేందర్ ,శీలం కవిత, పరిషవేణి కుమారస్వామి, పరిష బోయిన స్వరూప, శీలం రాకేష్, గంగారం నాగలక్ష్మి, బొల్లారం ప్రత్యూష లను పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, అంగన్వాడీ టీచర్స్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా కంచరాజు కుమార్ పుల్లూరి రామకృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కందికట్ల రమ, అంగన్వాడీ టీచర్స్ భీముడి లక్ష్మి నందిపాటి సంధ్య పాల్గొన్నారు.



## ఏటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్, నూగూరు వెంకటాపురం: చిరుతపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏటీఎఫ్ నాయకులు తక్షణమే పీఆర్సీ విడుదల చేయాలని, మేడారం జాతరకు సెలవులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పేరే జానకి రావు యు.రాం బాబు, ఎట్టి .బాబురావు, పి.నాగేశ్వరరావు, బోదేబోయిన జయ రాం ,బి.జీవనజ్యోతి, భాగ్యలక్ష్మి , వెంకటరమణ పాల్గొన్నారు.



## అక్షర దర్బార్ క్యాలెండర్ ఆవిష్కరణ

అక్షర దర్బార్ నూగూరు వెంకటాపురం : అక్షర దర్బార్ నూతన సంవత్సర కాలమానిని వెంకటాపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తాటి సరస్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారిదిగా పత్రికల పాత్ర అమోఘమన్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యం చేయడంలో పత్రికలు ముందు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సన్ని , కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు చిట్టెం సాయికృష్ణ, అక్షర దర్బార్ రిపోర్టర్ చిట్యాల చక్రి పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ అప్పగింత

అక్షర దర్బార్, శాయంపేట : పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు శాయంపేట ఎస్సై జె. పరమేశ్వర్ తెలిపారు. శాయంపేట మండలం సూరంపేట గ్రామానికి చెందిన ఈరబోయిన రాజేష్ మొబైల్ ఫోన్ పోయిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ట్రేస్ చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

## భక్తుల సేవలో రాధా టీఎంటి స్టీల్

ములుగు, అక్షర దర్బార్: మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర సందర్భంగా రాధా టీఎంటి స్టీల్ సంస్థ భక్తుల కోసం ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. శనివారం ఈ కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు భక్తులకు ఉచితంగా మినరల్ వాటర్ అందజేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.





# మేడారంలో తాత్కాలిక ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభం

- భక్తులకు శాశ్వత రవాణా సౌకర్యాలే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్



అక్షర దర్బార్, మేడారం : మేడారం మహాజాతర–2026 ఏర్పాట్లలో భాగంగా మేడారంలో తాత్కాలిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జాతర కాలంలో సుమారు 4,000 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని, అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. జనవరి 20 నుంచి ఫిబ్రవరి 1 వరకు జాతర ప్రత్యేక రవాణా సేవలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు ఆర్టీసీ బస్సులనే వినియోగించాలని కోరారు. స్వంత వాహనాలతో వస్తే పార్కింగ్, ఎక్కువ నడక వంటి ఇబ్బందులు ఉంటాయని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, భవిష్యత్తులో మేడారంలో శాశ్వత ఆర్టీసీ బస్‌స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈ డి వో మునిషేకర్ ఎడ్ కరీంనగర్ సోలోమన్ ఈ డి ఈ ఎస్ జి జి వెంకన్న సిటిఎం(ఎం & సి), శ్రీధర్ ఆరం వరంగల్. విజయభానువు డివిజనల్ ఆర్ ఎం వరంగల్ బానుకిరన్, బృందం పాల్గొన్నారు.

## భారీ అగ్నిప్రమాదం

- నాంపల్లిలోని ఓ ఫర్నీచర్ షాపులో ఎగిసిపడ్డ మంటలు
- నాలుగు అంతస్తులకు వ్యాపించిన అగ్నికీలలు..
- మంటల్లో చిక్కుకున్న ఆరుగురు!

అక్షరదర్బార్, హైదరాబాద్: నగరంలోని రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక ఒక ఫర్నీచర్ షాపులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది. క్షణాల్లోనే మంటలు నాలుగు అంతస్తుల మేర వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో ఆరుగురు చిక్కుకున్నట్లు సమాచారం. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. మంటలు వేగంగా విస్తరించడంతో వారు బయటకు రాలేక లోపలే ఉండిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తున్నారు.

- రంగంలోకి పోలీసులు

ప్రమాదం తీవ్రత దృష్ట్యా డీసీపీ శిల్పవల్లి స్వయంగా ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తూ, లోపల చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రస్తుతం ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. పరిసర ప్రాంతాల ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు. లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు రెస్క్యూ టీం సాహసోపేతమైన చర్యలు చేపడుతోంది.

## మార్బుల్ రాళ్లు పడి ఇద్దరు యువకుల మృతి

- మహబూబాబాద్ జిల్లా బంగ్లా తండాలో ఘటన
- మృతుల్లో ఒకరు బంగ్లా తండావాసి.. మరొకరు ఖమ్మం జిల్లావాసి



బోడ తరుణ్ (ఫైల్)



అవినాష్ (ఫైల్)

అక్షరదర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలో శనివారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బంగ్లా తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్బుల్ రాళ్లను తీసుకొచ్చిన క్రమంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ట్రాలీ నుంచి మార్బుల్ స్లోన్స్‌ను దించుతుండగా అవి ఒక్కసారిగా పైన పడటంతో ఈ విషాదం సంభవించింది. మృతుల్లో ఒకరు స్థానిక బంగ్లా తండాకు చెందిన బోడ తరుణ్ (25) కాగా, మరొకరు ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురి గ్రామానికి చెందిన ట్రాలీ డ్రైవర్ గుగులోత్ అవినాష్ (27)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే తరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన అవినాష్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం గార్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పనుల నిమిత్తం వచ్చి యువకులు మృత్యువాత పడటంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. నిర్మాణ పనుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం వచ్చిన మార్బుల్స్ ఇలా ప్రాణాలు తీయడం అందరినీ కలచివేసింది. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# గులాబీ దళం ఐక్యరాగం!

- ముున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా ఎర్రబెల్లి, పల్లా, పోచంపల్లి, రాజయ్యల సమరశంఖం
- స్టేషన్ ఘనపూర్ లో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం




అక్షరదర్బార్, స్టేషన్ ఘనపూర్ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెట్టింది. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఒకప్పుడు వైరి వర్గాలుగా ఉన్న కీలక నేతలందరూ ఒకే వేదికపైకి రావడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఈ సమావేశంలో పాలుపంచుకున్నారు. గతంలో కొంత మనస్పర్థలు ఉన్నప్పటికీ, పార్టీ ప్రయోజనాల దృష్ట్యా నేతలందరూ విభేదాలను పక్కన పెట్టి చేతులు కలపడం ఈ సమావేశంలో హైలైట్‌గా నిలిచింది.

**- ఐక్యతతోనే విజయం**

పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని, కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేసి మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేయాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ఈ విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిన వారికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని, స్టేషన్ ఘనపూర్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని నేతలు స్పష్టం చేశారు.

**- కార్యకర్తల్లో నూతనోత్తేజం**

నేతలందరూ కలిసికట్టుగా వేదికపై కనిపించడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాబోయే ఎన్నికల్లో స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఈ సమావేశానికి హాజరయ్యారు.



## వాహనదారులకు గుడ్ న్యూస్

- ఇక షోరూమ్ లోనే శాశ్వత రిజిస్ట్రేషన్
- రవాణాశాఖలో మెజార్టీ సేవలు ఆన్ లైన్ లోనే
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- హైదరాబాద్ నుంచి సేవలు ప్రారంభం

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రవాణా శాఖలో సరికొత్త సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. కొత్తగా వాహనం కొనుగోలు చేసే వారు ఇకపై రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. వాహనం కొన్న షోరూమ్ (డీలర్) వద్దనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసే సౌకర్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం హైదరాబాద్‌లో ఈ విధానాన్ని ప్రారంభించారు. ప్రజలకు రవాణా సేవలను మరింత సులభతరం చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. రవాణా శాఖలో మెజారిటీ సేవలను ఆన్‌లైన్ ద్వారానే అందించేలా మార్పులు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ 'సారథి' పోర్టల్‌లో చేరడం వల్ల వాహనదారులకు మెరుగైన సౌకర్యాలు లభించనున్నాయి. శాశ్వత రిజిస్ట్రేషన్‌తో పాటు లైసెన్స్ సేవలు కూడా ప్రజలకు మరింత చేరువ కానున్నాయి. రవాణా రంగంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇప్పటికే ఈవీ పాలసీ మరియు స్క్రాప్ పాలసీని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నిరంతరం మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా శాఖలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నారు. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దళారుల బెడద తప్పించడంతో పాటు సమయం ఆదా చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది. ప్రజలంతా ఈ సదుపాయాన్ని వినియోగించుకుని ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి కోరారు. వాహన కొనుగోలుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా డీలర్ల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఈ విధానం సమర్థవంతంగా అమలు అయ్యేలా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ నేతలపై రౌడీషీట్లు తెరవాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ధ్వజం



అక్షరదర్బార్, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతల బతుకంతా ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమేనని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని సీఎల్పీ మీడియా హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అశాంతిని రేకెత్తిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై రౌడీషీట్లు నమోదు చేయాలని, వారిపై ఎలాంటి జాలి చూపకుండా జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

**- అబద్ధపు ప్రచారమే బీఆర్ఎస్ ఆయుధం**

జిల్లాల విభజనపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోయినప్పటికీ, కేవలం ఎన్నికల ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని నాయిని విమర్శించారు. పదేళ్ల పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పలేని వారు, ఇప్పుడు ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంచితనం వల్లే మీరు ఇంకా బయట తిరుగుతున్నారు అని ఆయన వ్యాఖ్యానించారు.

**- 'పెద్దాయన' గుట్టు తేలుతుంది.**

ఫోన్ ట్యాపింగ్ విచారణ వేగవంతం అవుతోందని, ఈ వ్యవహారం కేటీఆర్‌తో ఆగిపోయేది కాదని, త్వరలోనే దీని వెనుక ఉన్న అసలు 'పెద్దాయన' ఎవరో బయటపడుతుందని ఆయన స్పష్టం చేశారు. తప్పులు చేసి విచారణకు వెళ్తుంటే, ఏదో స్వాతంత్ర్య ఉద్యమానికి వెళ్తున్నట్లు బీఆర్ఎస్ నేతలు బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్ రెడ్డిని ఇబ్బందులకు గురి చేసినప్పుడు ఈ నాయకులు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు.

## నోటీసులకు భయపడేది లేదు

అక్షర దర్బార్ శాయంపేట : ఫోన్ ట్యాపింగ్ సిట్ పేరుతో హరీష్ రావు, కేటీఆర్ ను నోటీసుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే భయపడేది లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శాయంపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ సజ్జనార్ తనకు నోటీసులు పంపించాడని, అలాంటి నోటీసులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న కేటీఆర్, హరీష్ రావులపై విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేయడం పిరికిపంద చర్య అని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీ ల పేరుతో ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బావిలో పడి తండ్రీకొడుకుల మృతి

- కుమారుడిని కాపాడబోయి తండ్రి కూడా..
- బలరాంతండాలో విషాదం



అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ మండలంలోని బలరాంతండాలో శనివారం పెను విషాదం చోటుచేసుకుంది. కళ్లముందే బావిలో పడిపోతున్న కన్నకొడుకును రక్షించబోయి, ఆ తండ్రి కూడా నీటిలో మునిగి ప్రాణాలు విడిచాడు. ఈ హృదయ విదారక ఘటన తండా వాసులను కన్నీటి పర్యంతం చేసింది.

**- అసలేం జరిగిందంటే..**

తండాకు చెందిన కేలోత్ మదన్ (40) తన రెండున్నరేళ్ల కుమారుడు జస్వంత్‌తో కలిసి పొలం వద్ద ఉన్న వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లారు. అక్కడ ఆడుకుంటున్న చిన్నారి జస్వంత్ అకస్మాత్తుగా అదుపుతప్పి బావిలో పడిపోయాడు. కొడుకును ఎలాగైనా బతికించుకోవాలనే ఆరాటంతో మదన్ వెనుకాముందు ఆలోచించకుండా బావిలోకి దూకాడు. అయితే దురదృష్టవశాత్తు బావిలో నీరు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ బయటకు రాలేక నీటిలోనే ఊపిరి వదిలారు.

**- గాలింపు చర్యలు**

చుట్టుపక్కల వారు గమనించి బావి వద్దకు చేరుకునేలోపే ఘోరం జరిగిపోయింది. గ్రామస్థులు గాలింపు చేపట్టి తండ్రి మదన్ మృతదేహాన్ని వెలికితీశారు. చిన్నారి జస్వంత్ మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఒకే ఇంట్లో తండ్రీకొడుకులు మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. తండా మొత్తం మూగబోయింది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915